మట్టి పరీక్ష.. పొలానికి రక్ష

- భూసార పరీక్షలతో సత్ఫలితాలు
- ఎరువులు, పెట్టుబడులు ఆదా
- అధిక దిగుబడులకు ఆస్కారం
- ప్రత్యేకంగా దృష్టి సారించిన వ్యవసాయాశాఖ
- మండలానికి లక్ష్యం 588 మట్టి పరీక్షలు


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ


బిలకలగూడూరులో మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

గడివేముల: గాలిలో దీపం పెట్టి దేవుడిపై భారం వేసినట్టుగా చాలా మంది రైతులు పంటకు కావాల్సిన పోషక విలువలు భూమిలో ఉన్నాయో లేవో తెలుసుకోకుండానే వ్యవసాయం చేస్తున్నారు. అధిక దిగుబడులే లక్ష్యంగా రసాయన ఎరువులు, పురుగు మందులు విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. దీంతో నేల నిస్సారంగా మారుతోంది. ఈ క్రమంలో ఆశించిన దిగుబడులు రాక నష్టపోతున్నారు. గడివేముల మండలంలో ఏటా 22 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. పంట సాగు చేసే ముందు ప్రతి రైతు భూసారం తెలుసుకోవడానికి మట్టి పరీక్ష చేయించుకోవాలి. భూసార పరీక్ష వల్ల ఏ పంట పండించాలో తెలుసుకోవచ్చు. రసాయన ఎరువు ఎంత వేయాలో తెలుస్తుంది. ఈ పరీక్ష చేయడం వల్ల భూమికి రక్షగా ఉంటుంది. భూసారం ఎప్పుడూ ఒకేలా ఉండదు. వేసే పంటలు, వాడే క్రిమిసంహారకాలు ఎరువులను బట్టి మార్పు చెందుతుంది. మార్పుల్ని ఎప్పటికప్పుడు కనిపెట్టి వ్యవసాయం చేస్తేనే మంచి దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్నారు. రైతులు అనువైన సమయంలో భూసార పరీక్షలు చేయించుకోవడం ఉత్తమమని చెబుతున్నారు. వాస్తవానికి 90 శాతం మంది రైతులు భూమిలో పోషకాలను తెలుసుకోకుండానే సాగు చేస్తున్నారు. రసాయనిక ఎరువులను విచ్చలవిడిగా వినియోగిస్తున్నా ఖర్చుల భారం తప్ప దిగుబడులు పెరగడం లేదు. అంతేకాకుండా వేసిన ఎరువుల వల్ల భూమిలో సహజసిద్ధంగా ఉండే పోషకాలు నశించిపోతున్నాయి. ఈ నేపథ్యంలో రైతులకు భూసార పరీక్షలపై అవగహన కల్పించేందుకు వ్యవసాయాశాఖ సమయాత్తమైంది. శాస్త్రీయ పద్ధతిలో వ్యవసాయం చేయడానికి భూసార పరీక్షలు ఎంత అవసరమో విస్తృతంగా ప్రచారం చేస్తోంది. విత్తనానికి ముందు మట్టి పరీక్షలు చేయించుకుని ఫలితాలను బట్టి నేలకు పోషకాలు అందించేలా వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. భూసార పరీక్షల విధానంలో కొత్త పద్ధతులను ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. మారిన విధానంలో గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (జీపీఎస్) ద్వారా మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు నిర్వహిస్తున్నారు.

మట్టి నమూనాల సేకరణ

ఎరువుల వినియోగంలో అనవసర ఖర్చులు తగ్గించేందుకు ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల్లోనే భూసార పరీక్షలు చేయించుకునే వెసులుబాటు కల్పించింది. భూమిలో ఉన్న పోషక పదార్థాలే కాకుండా చౌడు గుణాలు, సున్నపు శాతం నేల కాలుష్యాన్ని గుర్తించేందుకు ఈ పరీక్షలు ఉపయోగపడుతున్నాయి.

సూక్ష్మ పోషకాలే కీలకం

పంటల సాగులో మోతాదుకు మించి వాడుతున్న రసాయనిక ఎరువుల వల్లే భూమిలోని పోషకాలు నశించిపోతున్నాయి. పొటాష్‌ను ఎక్కువగా వాడడం వల్ల మెగ్నీషియం, జింక్, ఇనుము, వంటి సూక్ష్మ పోషకాలు మొక్కకు అందకుండా పోతున్నాయి. జింక్ లోపం కారణంగా మొక్క ఎదుగుదల తగ్గి దిగుబడులపై ప్రభావం చూపుతోంది. సూక్ష్మ, స్థూల పోషకాలతో పాటు పీహెచ్, సింద్రీయ కర్బనాల స్థాయి చాలా కీలకం. సింద్రీయ కర్బనం లోపిస్తే భూమి తన సహజ స్వభావాన్ని కోల్పోతుంది. ఎంత ఎరువు వేసినా భూమి గ్రహించకుండా నిస్సారమైపోతుంది. భూమిలో సేంద్రీయ కర్బనం 0.5 శాతం నుంచి 0.76శాతం వరకు ఉంటే సాధారణంగా పరిగణిస్తారు. చాలా చోట్ల భూమిలో ఇది 0.1 శాతం నుంచి 0.2 శాతం వరకు ఉన్నట్టు గత పరీక్షల నివేదికల ద్వారా అధికారులు గుర్తించారు. పొలంలో సేకరించిన మట్టిని ప్రయోగశాలలో భౌతిక, రసాయనిక పద్ధతుల్లో విశ్లేషించి నేల స్వభావం, లక్షణాలు, పోషక విలువల స్థాయి గుర్తిస్తారు. దీని ద్వారా భూమిలో లోపించిన లవణాలను గుర్తించి దానికి అనుగుణంగా ఎరువులను వేసుకోవడం వల్ల పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. ప్రతి మూడేళ్లకోసారి భూసార పరీక్షలు చేయించుకోవడం మంచిదని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. మరో వైపు మట్టి నమూనా సేకరించే విధానంపై వీఏఏలు, ఏఓలకు వ్యవసాయాశాఖ ఇప్పటికే జిల్లా స్థాయి అధికారులు శిక్షణ ఇచ్చారు. మట్టి నమూనాలను సేకరించి పరీక్షలకు తరలించే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రైతులకు తెలియజేయాల్సిన వివరాలపై సిబ్బందికి సమగ్ర శిక్షణ ఇచ్చారు.

రైతులకు అవగహన పెరగాలి

మట్టి పరీక్ష లేకుండా పంట సాగు చేయకూడదు. ప్రస్తుత పరిస్థితుల్లో భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. నేల ఆరోగ్యంగా ఉంటే అందరం ఆరోగ్యంగా ఉంటాం. మట్టి పరీక్షల ఆధారంగా యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు. తద్వారా పెట్టుబడి వ్యయం కూడా తగ్గుతుంది. దీనిపై రైతుల్లో అవగహన పెంచేందుకు కృషి చేస్తున్నాం. భూసార ప్రయోగ కేంద్రంలో మట్టికి సంబంధించి ఉదజని సూచిక, నేల స్వభావం, లవణ సాంద్రత, సేంద్రీయ కర్బనం స్థాయిని లెక్కిస్తారు. ప్రయోగశాల నుంచి ఫలితాలను బట్టి వ్యవసాయ అధికారులు చెప్పే సూచనలు రైతులు తప్పకుండా పాటిస్తే మంచి ఫలితాలు వస్తాయి.

–హేమ సుందర్ రెడ్డి, ఏఓ, గడివేముల

దడ పుట్టిస్తున్న ధరలు

- భారీగా పెరిగిన కూరగాయల ధరలు
- ఏది కొందామన్నా రూ.60పై మాటే


సంతలో కూరగాయలను కోనుగోలు చేస్తున్న మహిళలు

కోడుమూరు రూరల్: మార్కెట్‌లో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో ఏ కూరగాయ కొందామన్నా కిలో రూ.60 నుంచి రూ.140 మధ్య పలుకుతూ సామాన్య ప్రజలకు భారంగా మారుతోంది. శనివారం కోడుమూరులో జరిగిన సంతలో కిలో టమాట రూ.60 ఉండగా, క్యాబేజీ రూ.60, క్యాలీఫ్లవర్ రూ.80, మిర్చి రూ.80, క్యారెట్ రూ.70, చిక్కుడు రూ.90, బీన్స్ రూ.140, కాకరకాయ రూ.80, బీట్‌రూట్ రూ.60, బీరకాయ రూ.60, ఆలుగడ్డ రూ.60, దోసకాయ రూ.60, దొండకాయ రూ.60 పలుకగా, వంకాయ రూ.70, బెండకాయలు కిలో రూ.50 ధర పలికింది. పెరిగిన కూరగాయల ధరలను చూసి సామాన్య ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ప్రస్తుతం పెరిగిన ధరలతో రూ.500 కూరగాయలు కొన్నా వారం రోజులకు సరిపోవడం లేదని ప్రజలు వాపోయారు. చుట్టు పక్కల గ్రామాల్లో కూరగాయల దిగుబడి తగ్గిపోవడంతో కూరగాయల రేట్లు విపరీతంగా పెరిగినట్లు వ్యాపారులు తెలిపారు.

భారీగా తగ్గిన కూరగాయల సాగు

గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో భూగర్భ జలాలు అడుగంటడం, తీవ్రమైన ఎండల కారణంగా నియోజకవర్గంలోని కోడుమూరు, సి.బెళగల్ మండలాల్లోని చాలా గ్రామాల్లో రైతులు కూరగాయల సాగును చేయలేదు. స్థానికంగా కూరగాయాలు పండకపోవడంతో వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలను దిగుమతి చేసుకుంటుండడం వల్ల రవాణా ఖర్చులతో కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి.

క్లుప్తంగా

పరిశుభ్రతతో రోగాలు దూరం


సి.బెళగల్‌లో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఈఓఆర్డీ సందీప్

సి.బెళగల్: పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు వ్యాప్తి చెందకుండా ఉంటాయని ఈఓఆర్డీ సందీప్, సర్పంచ్ పాండురంగన్న అన్నారు. శనివారం సి.బెళగల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేయించారు. ప్రధాన వీధుల్లో చెత్తాచెదారం తొలగించారు. మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేశారు. అలాగే పాత కెనరా బ్యాంక్ వద్ద మురుగు కాలువపై చేపట్టిన కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. స్వచ్ఛమైన గ్రామంగా తీర్చిదిద్దడానికి స్థానికులు సహకరించాలని కోరారు. ఎక్కడపడితే అక్కడ చెత్త పడేయరాదని.. ఇళ్ల పరిసరాల్లో మురుగు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. వార్డు సభ్యుడు గొర్ల మద్దిలేటి, సచివాలయ ఇంజినీర్ అసిస్టెంట్ శ్రీరాములు ఉన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

సి.బెళగల్: మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ బలరాముడు తెలిపారు. పాఠశాలలో 6, 8, 9వ తరగతుల్లో ఖాళీగా ఉన్న 6 సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించగా 303 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారికి శనివారం తరగతుల వారీగా ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. ఇందులో 37 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని, ఎంపికైన విద్యార్థుల వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

పంచాయతీ గదులకు వేలం


వేలం నిర్వహిస్తున్న ఈఓఆర్డీ సుబ్బరాయుడు

ఓర్వకల్లు: మండల కేంద్రమైన ఓర్వకల్లు గ్రామంలో బండ్లమెట్ట, నాలుగు పంచాయతీ గదులకు శనివారం వేలం పాట నిర్వహించారు. స్థానిక సచివాలయం వద్ద ఈఓఆర్డీ సుబ్బరాయుడు, గ్రామ పెద్దల సమక్షంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి బండ్లమెట్టకు నలుగురు డిపాజిట్లు చెల్లించారు. అందులో హెచ్చుపాటదారుడైన బోయ మద్దిలేటి రూ.1.52 లక్షలకు దక్కించుకున్నారు. గ్రామ పంచాయతీకి చెందిన నాలుగు షాపుల్లో ఒకటో షాపును యూసఫ్ రూ.9,200, రెండో షాపును మంగళి వెంకటేశ్వర్లు రూ.9,300లకు దక్కించుకున్నారు. అలాగే మూడో షాపును చాకలి రంగడు రూ.9,200, నాల్గవ షాపును మాసూం బాషా దక్కించుకున్నట్లు వెల్లడించారు. నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, వెంకటరమణారెడ్డి, అన్వర్‌బాషా, పింజరి అబ్దుల్లా, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోగుల కోసం కుర్చీల ఏర్పాటు


రోగుల కోసం ఏర్పాటు చేసిన కుర్చీలు

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో వైద్యపరీక్షల కోసం వస్తున్న రోగుల కోసం కుర్చీలు ఏర్పాటు చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన ఈ బ్లాక్‌లో వైద్యపరీక్షల కోసం వచ్చిన రోగులు, వారి సహాయకులు కూర్చోవడానికి కుర్చీలు లేక ఎక్కువసేపు నిలబడి ఉంటున్నారని తెలుసుకున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి ఆ దిశగా చర్యలు చేపట్టారు. అలాగే రోగులను ఎక్కువసేపు వేచి ఉండేటట్లు చేయకుండా త్వరగా రిపోర్టులు ఇవ్వాలని ల్యాబ్ సిబ్బందిని ఆయన ఆదేశించారు.

జీతాలు చెల్లించి న్యాయం చేయండి

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బంది తమకు జీతాలు చెల్లించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వీరు రెండో రోజు శనివారం విధులు బహిష్కరించారు. వర్సిటీ ఇండోర్ స్టేడియం వద్ద సుమారు 30 మంది సిబ్బంది సమావేశమై తమ సమస్యలను చెప్పుకోడానికి వర్సిటీ వైస్‌చాన్సలర్ బి.సుధీర్ ప్రేమ్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ నాగుల అంకన్న కోసం ఎదురు చూశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము వర్సిటీలో సంవత్సరాల తరబడి విధులు నిర్వహిస్తున్నప్పటికీ జీతాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే మంత్రులు, ప్రజా ప్రతినిధులకు తమ సమస్యలను వివరిస్తూ వినతి పత్రాలు సమర్పిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని కోరారు.

బాలికల హాస్టల్‌కు కొరవడిన రక్షణ


ఓర్వకల్లు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కూలిన ప్రహరీ గోడ

- కూలిన పాఠశాల ప్రహరీ
- స్నానపు గదుల వైపు తొంగిచూస్తున్న ఆకతాయిలు
- అసౌకర్యానికి గురవుతున్న బాలికలు

ఓర్వకల్లు: అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ బాలికల వసతి గృహానికి రక్షణ కొరవడింది. పాఠశాల ప్రహరీ గోడ అనతికాలంలోనే కూలడంతో కొందరు ఆకతాయిలు కూలిన గోడపై నుంచి హాస్టల్ స్నానపు గదుల్లోకి తొంగిచూస్తున్న సంఘటన ఓర్వకల్లు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆలస్యంగా వెలుగుచూసింది. గత టీడీపీ హయాంలో పాఠశాలకు నిర్మించిన ప్రహరీ గోడ నెల క్రితం కురిసిన గాలివానకు హాస్టల్ స్నానపు గదుల వద్ద 10 మీటర్ల పొడవు కుప్పకూలింది. ఈ విషయాన్ని ఇంతవరకు ఎవ్వరూ పట్టించుకోకపోవడం గమనార్హం. ఇలా ఉండగా హాస్టల్ విద్యార్థినులు ఉదయం, సాయంత్రం వేళల్లో స్నానం చేస్తున్న సమయంలో కూలిన గోడపైకెక్కి స్నానపు గదుల వెంటిలేటర్ల నుంచి తొంగిచూస్తున్నట్లు బాలికలు వాపోతున్నారు. ఇది గమనించిన హాస్టల్ విద్యార్థినులు తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నట్లు పాఠశాల సిబ్బందితో మొర పెట్టుకున్నారు. సదరు గోడ నుంచి హాస్టల్‌లోకి ప్రవేశించే అవకాశాలు లేకపోలేదని భయాందోళన చెందుతున్నారు. విద్యార్థినుల బాధను అర్థం చేసుకుని వెంటనే ప్రహరీ గోడకు మరమ్మతు చేయించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

రేపు పింఛన్ల పంపిణీ

కల్లూరు: మండలంలోని 8,381 మంది సామాజిక భద్రత పింఛన్ లబ్ధిదారులకు సోమవారం ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. పెన్షన్ లబ్ధిదారులు ఎవరూ గ్రామ సచివాలయాల దగ్గరకు రాకుడదని, సచివాలయాల ఉద్యోగులు ఇంటింటికి వచ్చి పెన్షన్ ఇస్తారని చెప్పారు.

ఎస్సీ, ఎస్టీ కేసు విచారణ


ఆర్లగడ్డలో విచారిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

గడివేముల: మండల పరిధిలోని బిలకలగూడూరు మజార గ్రామమైన ఆర్లగడ్డలో ఈనెల 24వ తేదీ జరిగిన ఘర్షణలో 8 మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసు విచారణ నిమిత్తం శనివారం ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు గ్రామానికి వచ్చారు. పలువురి వద్ద విచారణ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. చిన్న గొడవలకు పోయి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవుపలికారు. ఏమైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. ఆయన వెంట వెంకటసుబ్బయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

డయేరియాపై అప్రమత్తత అవసరం



కొత్తూరు నీటి కుంటను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రవీణ్‌కుమార్,గ్రామంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

- కలుషిత నీటితో వ్యాధులు ప్రబలే అవకాశం
- డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రవీణ్‌కుమార్

కోడుమూరు రూరల్: డయేరియాపై అప్రమత్తంగా ఉండాలని.. ఎట్టి పరిస్థితుల్లో కుంటల్లోని నీటిని తాగొద్దని డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రవీణ్‌కుమార్ కొత్తూరు ప్రజలకు సూచించారు. శనివారం కోడుమూరు మండలం కొత్తూరు గ్రామంలో ఆయన పర్యటించారు. వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేశారు. నీటి కలుషితం వల్ల డయేరియా ప్రబలుతున్న దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, కుంట నీటిని తాగరాదని తెలిపారు. ఇళ్లు, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రజలకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. అలాగే గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అవసరమైన వారికి మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలని ఆదేశించారు. ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతుంటే వెంటనే చికిత్స అందించాలన్నారు. ఆయన వెంట వైద్యురాలు షఫియా బేగం, హెల్త్ ఎడ్యుకేటర్ కృష్ణారెడ్డి, ఎంపీహెచ్ఈఓ రామకృష్ణయ్య ఉన్నారు.

కల్లూరు సబ్‌రిజిస్ట్రార్‌గా నషీర్

కర్నూలు(సెంట్రల్): కల్లూరు సబ్ రిజిస్ట్రార్‌గా ఎస్. నషీర్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డీఐజీ పీపీ కల్యాణి ఉత్తర్వులు ఇచ్చారు. ఎస్.నషీర్ పులివెందుల జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తూ బదిలీపై కల్లూరుకు వస్తున్నారు. అక్కడ ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ హాజి మియ్యా తన పాత పోస్టు నంద్యాల జిల్లా రిజిస్ట్రార్ ఆఫీస్‌లో రిపోర్టు చేసుకోవాల్సి ఉంటుంది.

సుంకేసులకు 720 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు రూరల్: సుంకేసుల రిజర్వాయర్‌కు శనివారం 720 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు డ్యాం జేఈ రాజు తెలిపారు. రిజర్వాయర్‌కు ఎగువ నుంచి 720 క్యూసెక్కుల నీరు వస్తుండగా ఒక గేటును తెరిచి దిగువకు 456 క్యూసెక్కులు, కేసీ కెనాల్‌కు 256 క్యూసెక్కులను విడుదల చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం రిజర్వాయర్ పూర్తి సామర్థ్యంతో నిండుగా ఉందని తెలిపారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ


జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు పూలబొకే అందజేస్తున్న మునిసిపల్ కమిషనర్ భార్గవత్‌తేజ

కర్నూలు(సెంట్రల్): జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.రంజిత్‌బాషాకు అధికారులు, ప్రజాసంఘాల నాయకుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. రెండోరోజైనా శనివారం రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పాణ్యం, నందికొట్కూరు ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, జయసూర్య కలెక్టర్‌ను ఆయన చాంబరులో కలిసి మాట్లాడారు.సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాబురావు కలెక్టర్‌ను ఆయన చాంబరులో కలిసి బొకేలు అందజేశారు. టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరిచంద్రప్ప, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, రాయలసీమ విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ అధ్యక్షుడు శ్రీరాములు, మాల యువసేన రాష్ట్ర అధ్యక్షుడు యాట ఓబులేషు, ఏపీయూడబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనర్ నాగేంద్ర ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు, ఫొటో వీడియో జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామస్వామి ఆధ్వర్యంలోని బృందాలు కలెక్టర్‌ను కలిసి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

సమస్యలను పరిష్కరించాలి

గూడూరు రూరల్: పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోఆప్షన్ సభ్యుడు రామాంజనేయులు మున్సిపల్ అధికారులను కోరారు. శనివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ జె.వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఇన్‌చార్జి కమిషనర్ నరసింహులు కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి నెలా కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నారని.. అయితే ఆయా వార్డుల్లోని కౌన్సిలర్లకు అధికారులు ముందస్తు సమాచారాన్ని అందించడం లేదని, గతంలో కూడా ఈ విషయాన్ని ప్రస్తావించామని.. అయినా అధికారుల తీరు మారలేదని కౌన్సిలర్ దస్తగిరి నిలదీశారు. తమ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పాఠశాలకు వెళ్లేందుకు సరైన రోడ్డు లేక పిల్లలు అవస్థలు పడుతున్నారని.. అధికారులు స్పందించి పాఠశాలకు మట్టి రోడ్డుతో పాటు కాలనీల్లో డ్రైనేజీలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పీఎస్ అస్లాం, లక్ష్మన్న, కౌన్సిలర్లు బుడంగళి, రత్నమ్మ, బజారి, తదితరులు పాల్గొన్నారు.

తడకనపల్లె రోడ్డు గుంతలమయం


గుంతలమయంగా మారిన రోడ్డు

కల్లూరు: మండల పరిధిలోని తడకనపల్లె గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతల మయంగా మారింది. 44వ జాతీయ రహదారి నుంచి తడకనపల్లె గ్రామానికి సుమారుగా నాలుగు కిలోమీటర్ల దూరం ఉంది. గ్రామానికి వెళ్లే దారి గుంతలమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుపై నిత్యం అధిక లోడుతో భారీ వాహనాలు తిరగడంతో రోడ్డుపై గుంతలు ఏర్పాడుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర, ఆటో వాహదారులు ఎదురుగా భారీ వాహనాలు వస్తున్నాయంటే భయం భయంగా ప్రయాణం చేయాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు, ప్రయాణికులు కోరుతున్నారు.

సేవతోనే ఉద్యోగులకు గుర్తింపు


రిటైర్డ్ వీఆర్వోలను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కోడుమూరు రూరల్: ప్రజలకు సేవతోనే ఉద్యోగులకు మంచి పేరు వస్తుందని కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రిటైర్డ్ అయిన వీఆర్వోలు విశ్వనాథ్‌రెడ్డి, సంజీవరెడ్డిలను తహసీల్దార్ గుర్రప్ప, డీటీ రామాంజనేయులు ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, తహసీల్దార్ మాట్లాడుతూ.. విశ్వనాథ్‌రెడ్డి, సంజీవరెడ్డి ప్రజలకు ఎంతో సేవ చేశారని, పదవీ విరమణ అనంతరం వారి శేష జీవితం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సునీల్, రీసర్వే డీటీ అమీనాబేగం, వీఆర్వోలు ఎల్లప్ప, నారాయణ, పరమేష్, రాఘవేంద్ర, సత్యరాజ్, జయరాముడు, వెంకటేష్, బీరప్ప, మధు, మహేష్, రామక్రిష్ణ, వైఎస్సార్‌సీపీ నేత తేనేశ్వరరెడ్డి పాల్గొన్నారు.